క్లుప్తంగా

ఉచిత పశువైద్య శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పాడి పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సోలీపేట్ గ్రామంలో పశువులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 15 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స చేశారు. 40 గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించి, దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్యసిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు ఉన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

షాద్‌నగర్: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటుగా మిగితా అధికారులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం షాద్‌నగర్ తాలుకా ఉద్యోగ జేఏసీ, టీఎన్‌జీఓస్ సంఘం నాయకులు తహసీల్దార్ పార్థసారధికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ... ఫార్మాసిటీ భూసేకరణకు సంబంధించి అభిప్రాయ సేకరణ కోసం అధికారులు వస్తే ఉద్దేశపూర్వకంగా కొందరు వ్యక్తులు దాడి చేయడం సరికాదన్నారు. దాడి ఘటనలో పాత్రదారులు, సూత్రదారులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఎన్‌జీఓస్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్‌సింగ్, శ్రీనివాస్, శ్రీహరి, వేణుమాధవ్, సూర్యప్రకాశ్, రమేశ్, నరేశ్, రాంచందర్, నర్సింహ, శ్రీను, జ్యోతి, రాజు తదితరులు ఉన్నారు.

కలెక్టర్, అధికారులపై దాడి హేయమైన చర్య

నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన



నిరసన తెలుపుతున్న అధికారులు

శంకర్‌పల్లి: వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి చేయడాన్ని ఎంపీడీఓ వెంకయ్య తీవ్రంగా ఖండించారు. అధికారులపై దాడిని నిరసిస్తూ గురువారం మధ్యాహ్నం వేళ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ వెంకయ్య, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, అదేవిధంగా భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేశ్



నియామకపత్రం అందుకుంటున్న మల్లేశ్

శంకర్‌పల్లి: ఐఎన్‌టీయూసీఎఫ్(ఇండియన్ నేషనల్ ట్రేడ్స్ యూనియన్ ఫెడరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడిగా మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం గ్రామానికి చెందిన జె.మల్లేశ్ నియామకమయ్యాడు. ఈ మేరకు గురువారం శంకర్‌పల్లికిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురహరి నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం నిరంతరం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఎక్కడైనా కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నట్లైతే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శరణ్యరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు
- ఆన్‌లైన్‌లోనూ మార్పులు, చేర్పులకు ఛాన్స్
- ఈనెల 28 వరకు తుది గడువు



ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సరిత

షాద్‌నగర్: గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచినా ఓటరు జాబితాలో పేరులేక చాలా మంది నిరాశతో వెనుదిరిగారు. అలాంటి వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో రానున్న పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం దక్కుతుంది. ఓటరు జాబితా సవరణలలో భాగంగా ఎన్నికల సంఘం ఓటరుగా నమోదు, మార్పులు చేర్పులు, చనిపోయిన వ్యక్తుల పేర్ల తొలగింపునకు ఎన్నికల సంఘం ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది.

అందుబాటులో బీఎల్ఓలు

ఓటరు జాబితాలో పేరు లేనివారు, పేర్లు గల్లంతైన వారు నమోదు చేసేందుకు, రెండు మూడుచోట్ల పేరు వచ్చినా తొలగించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓలు)ను నియమించారు. పోలింగ్ కేంద్రాలోనే బీఎల్ఓలు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అదేవిధంగా అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్య కూడళ్ల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

కొత్తగా ఓటు హక్కు కోసం

1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రెండు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు, నివాస, వయస్సు, ధ్రువీకరణ పత్రాలతో బీఎల్ఓలకు దరఖాస్తులు అందజేయాలి లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 28వ తేదీవరకు ఎన్నికల సంఘం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించింది.

పేర్ల తొలగింపు కోసం

స్థానికంగా లేక ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం-7ను ఉపయోగించాలి. అదేవిధంగా వలస వెళ్లిన వారు ఒకరికి రెండు చోట్ల ఓటరు జాబితాలో పేరు ఉంటే లేదా చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు ఈ ఫారంను ఉపయోగించాలి.

మార్పులు, చేర్పులు ఇలా

ఫారం-8 ద్వారా ఓటరు పేరు, పుట్టిన తేదీ, చిరునామా, వంటి మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో ప్రాంతానికి మార్పు చేసుకోవడంతో పాటుగా గతంలో ఓటరుగా నమోదై ఉండి వైకల్య ధ్రువీకరణ లేకుంటే దివ్యాంగులుగా ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం

ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలనేకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. www. nvsp.in వెబ్‌సైట్‌లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు స్పష్టమైన చిరుమానా, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులన్నింటినీ బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

అర్హులైనవారు నమోదు చేసుకోవాలి



కొత్త ఓటు హక్కు కోసం, ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తులను పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు స్వీకరిస్తున్నారు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు.

– ఎస్ఆర్ సరిత, ఆర్డీఓ, షాద్‌నగర్



విర్యాల పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కేశంపేట: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా బాలల దినోత్సవం

షాద్‌నగర్: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రతిఏటా నిర్వహించే బాలల దినోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని విర్యాల గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం అవుల రవి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి మిత్రులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరేశ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగించాలి

కేశంపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి యువత నెహ్రూ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, పర్వతాలు, రాములు, రాజేందర్‌రెడ్డి, రమేశ్, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లిలా..?

- ఏళ్లు గడుస్తున్నా తొలగించని శిథిలాలు
- భయాందోళనకు గురవుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కొందుర్గు: పాఠశాల పక్కనే ఏళ్లుగా శిథిలాలు పడి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరం. మండలంలోని రామచంద్రాపూర్ ప్రభుత్వ పాఠశాల పక్కనే అంగన్‌వాడీ భవనం కూలిపడి ఉంది. భవనం కూలిపడి దాదాపు పదేళ్లు కావొస్తున్నా ఇటు ఉపాధ్యాయులు, అటు అధికారులు, స్థానిక నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాల చుట్టూ చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయాయని, అదేవిధంగా కూలిన అంగన్‌వాడీ భవనం విషసర్పాలకు స్థావరంగా మారిందని వాపోతున్నారు. పలుమార్లు పాఠశాల భవనంలోకి పాములు వచ్చాయని, ఈ విషయమై అధికారులకు తెలిపినా ఫలితం దక్కడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలోకి ఎప్పుడు ఏ విషపూరిత కీటకాలు వస్తాయోనని భయాందోళనతో విద్యార్థులు కాలం గడుపుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల పక్కనే కూలిపడిన అంగన్‌వాడీ భవనం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు, రైతులు

శంకర్‌పల్లి: రైతులు తమ తమ పొలాల్లోనే వరి ధాన్యం ఎండబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని వ్యవసాయ శాఖ ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి సురేశ్ అన్నారు. గురువారం మోకిల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మోకిల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీఓ వెంకయ్య, మోకిల పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వరి ధాన్యం గ్రేడ్ 'ఏ' రకం క్వింటాల్‌కు రూ.2320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2300 కనీస మద్దతు ఇస్తుందన్నారు. రైతులు ధాన్యం తీసుకొచ్చేటప్పుడు 17శాతం కన్నా తక్కువ తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్‌కు రూ.500లు బోనస్‌గా ఇస్తుందని స్పష్టం చేశారు. ధాన్యానికి కావాల్సినన్నీ సంచులు తక్షణమే ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయగా.. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చైతన్య, ఏఈఓ రామకృష్ణరెడ్డి, శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మోకిల పీఏసీఎస్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సీఎం సభకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు



బస్సుల వద్ద తహసీల్దార్ కృష్ణయ్య, ఎంఈఓ పురన్‌దాస్, పోలీసులు

చేవెళ్ల: బాలల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రితో ఎల్బీ స్టేడియంలో జరిగే వేడుకలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లారు. గురువారం ఉదయం ఆదర్శ పాఠశాల వద్ద ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు బస్సుల్లో విద్యార్థులు సీఎం కార్యక్రమానికి తీసుకెళ్లినట్లు ఎంఈఓ పురన్‌దాస్ తెలిపారు. ఈ వేడుకలకు సంబంధించి ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులను తీసుకెళ్తున్నారని, ఇందులో చేవెళ్ల ఆదర్శ పాఠశాల కూడా ఉందని చెప్పారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి ఆధ్వర్యంలో ఈ బస్సులను పోలీస్ బందోబస్త్‌తో పంపించామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడం సరికాదు

షాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు తరలించడం సరికాదని సంకెపల్లిగూడ మాజీ సర్పంచ్ కుమ్మరి దర్శన్ అన్నారు. గురువారం షాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా రైతుల భూములు లాక్కొని ఫార్మా కంపెనీ పెట్టొద్దని అడిగినందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రైతులపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధిచెప్పేవరకు నిరంతరం రైతులకు మద్దతు ఇస్తామన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

షాబాద్: ప్రజలు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకొని మానసిక ప్రశాంతతను పొందాలని సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, హైతాబాద్ మాజీ సర్పంచ్ ర్యాకల శేఖర్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయంలో మల్లన్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



స్వామివారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న యాదయ్య, తదితరులు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ, ట్రస్ట్ ప్రతినిధులు

- సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం చేవెళ్లకు చెందిన అయ్యగారి కృష్ణమాచారి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు గోపాలచారి, శేషాద్రిలు కళాశాలలోని ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.50వేలు, కళాశాలలో ల్యాబ్ అభివృద్ధికి రూ.75వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు అయ్యగారి ట్రస్ట్ ముందుకొచ్చి నగదు ప్రోత్సాహకాలు అందించటంతో పాటు కళాశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో ఉన్న గ్రూప్‌ల వారీగా ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామారావు, చేవెళ్ల ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ సంధ్యారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనమాల, డాక్టర్ రేణుకాచారి, ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది బిచ్చయ్య, రాజశేఖర్, బాబు, శ్రీనివాస్, ఈశ్వర్, నరేశ్‌కుమార్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ బన్సీలాల్ ఎన్యుమరేటర్లకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లాడుతూ.. ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి అన్ని కుటుంబాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని సూచించారు. ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఈ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేరుకూరుతుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైనవారు తమ వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ చెక్కులను జిల్లా ఇన్‌చార్జి డి.శ్రీధర్ సహకారంతో అందజేశామన్నారు. ఆయనకు లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఆర్డీసీఎల్ ద్వారా మంజూరైన రూ.18కోట్ల నిధులతో కొత్తూరు వైజంక్షన్ నుంచి వినాయక స్టీల్ వరకు, రూ.32కోట్లతో కొత్తూరు రైల్వే క్రాసింగ్ నుంచి కుమ్మరిగూడ వరకు చేపట్టనున్న బీటీరోడ్ల పనులకు ఆయన పలువురు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఆయా మార్గాల్లో రోడ్లు చాలా ఏళ్లుగా నిర్వహణ, మరమ్మతులు లేక గుంతలమయంగా మారినట్లు స్థానిక నాయకులు తన దృష్టికి తేవడంతో నిధులు మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. వ్యాపారులు, ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు లేకుండా రోడ్ల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధి పనులకు వ్యాపారులు, నాయకులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం కుమ్మరిగూడలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొని చిన్నారులకు విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ అరుంధతి, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

విద్యారంగ అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. స్వస్తిక్ మిర్చి సంస్థ నిర్వాహకులు కళాశాల నిర్మాణానికి రూ.25లక్షలు ఇవ్వడంపై ఆయన సంస్థ యజమానులకు అభినందనలు తెలిపారు. గత పాలకులు సొంత ప్రయోజనాల కోసం విరాళాలు సేకరించగా తాను ప్రజాప్రయోజనాలు, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దాతల సాయంతో పాటు తాను సహకరించి త్వరలో జూనియర్ కళాశాల భవనాన్ని అత్యాధునిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకు రానున్నట్లు తెలిపారు.